# శ్రీరామచంద్ర మిషన్®

# ఎఖోస్ ఇండియా

నవంబరు 2008 సభ్యులకు మాత్రమే సంపుటి 1 సంచిక 6


ప్రియమైన సోదరీ సోదరులారా!

"ఎఖోస్ ఇండియా", 2008 సంవత్సరానికి ఆఖరు సంచికకు స్వాగతం. దేశములోని అన్ని ప్రాంతాలనుండి, మిషనుకు సంబంధించిన వార్తలను సేకరించి, ఎనిమిది ప్రాంతీయ భాషలలోనికి తర్జుమా చేసిన టీమ్ సభ్యులకు ఇది ఫలప్రదమైన సంవత్సరము. తర్జుమా సభ్యుల హృదయపూర్వక సహకారము లేకుంటే, ఈ న్యూస్ లెటర్ సకాలములో విడుదల చేయడం జరిగేది కాదు. న్యూస్ వలంటీర్లు, జోనల్ కో-ఆర్డినేటర్లు, జోనల్ ఇన్‌ఛార్జీలు ప్రదర్శించే అమితోత్సాహంతో ఇది సాధ్యపడింది.

ఈ న్యూస్‌లెటర్‌లోని నవంబరు సంచికలో, మాస్టరుగారి, తమిళనాడు, చైనా మరియు ఆంధ్రప్రదేశ్ పర్యటనల విశేషాలున్నవి. ఈ సంచికలో దేశవ్యాప్తంగా, ఎన్నో పాఠశాలల్లోను, కళాశాలల్లోను నిర్వహించబడిన వ్యాస రచన పోటీ గురించి, ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లు, ఓపెన్ హౌస్ ప్రోగ్రాములు, వి.బి.యస్.ఇ. కార్యక్రమాల గురించిన ముఖ్యమైన వార్తలున్నవి.

2009, జనవరి సంచికకు, వార్తావిషయాలు చేరవలసిన ఆఖరు తేదీ డిసెంబరు 15, 2008. మీ సంబంధిత జోన్ ఇన్‌ఛార్జ్ లేదా జోనల్ కో-ఆర్డినేటర్‌ల ద్వారా వార్తలను, ఫోటోలతో పంపవలసింది.

ఎఖోస్ ఇండియా న్యూస్‌లెటర్ టీమ్

## ఉత్సాహపూరితంగా మధురై పర్యటన



మాస్టరుగారు, ఆగస్టు 30వ తేదీ సాయంత్రానికి, ట్రిచి నుండి కారులో మధురై ఆశ్రమానికి వచ్చారు. తమిళనాడులో చెన్నై, తిరుప్పూరు తర్వాత, మధురై ఆశ్రమము అతిపెద్దది. ఇది సుమారు మూడు ఎకరాల స్థలములో ఉంది. ధ్యానమందిరము పూర్తిగా పక్కా భవనము కాదు, 2000 మంది అభ్యాసీలకు అనువైనది. మాస్టరుగారితో ఉండేందుకు మధురైకు దక్షిణంగా నున్న అన్ని సెంటర్లనుండి అభ్యాసీలు అక్కడకు చేరారు. డెలిగేట్ కార్డులపై ముద్రించిన - థీమ్ (విషయము) - "మాస్టరుగారి ప్రేమలో ఉత్తేజితులవ్వడం".

ఆగస్టు 31, ఆదివారం సత్సంగ్ తర్వాత మాస్టరుగారు తమిళములో అనర్గళంగా 30 నిమిషాలు మాట్లాడారు. 'కుటుంబ జీవితము - ఆధ్యాత్మికత' అనే అంశముపై మాట్లాడారు. స్త్రీలు, భర్త చేయి పట్టుకొని, హృదయములో మాస్టరుగారిని నిల్పుకోవాలన్నారు. భార్యాభర్త లిరువురూ సహజమార్గములోనికి వస్తే ఇంకా మంచిదన్నారు. ఆనందమైన వైవాహిక జీవితానికి మూడు విషయాలను దూరంగా ఉంచాలన్నారు. కోపము, అనుమానము మరియు అసూయ. మాస్టరుగారు, చివరగా ఈ భూమిపై ఇల్లు కట్టుకొనడంలోనే మునిగిపోగూడదని, మన హృదయంలోనే "మన గృహం" ఉందని గుర్తుంచుకోవాలన్నారు.

మాస్టరుగారు కొంతసేపు గతస్మృతుల్లోకి వెళ్ళి, వారి వివాహము జరిగిన కళ్యాణమంటపాన్ని, అప్పట్లో సత్సంగములు నిర్వహింపబడుచున్న వలంజీ భవనాన్ని దర్శించారు. మాస్టరుగారు టి.టి.కె.సంస్థల్లో పనిచేసేప్పుడు ఈ ప్రాంతాన్ని పర్యటించిన జ్ఞాపకాలతో వాతావరణ ఉత్సాహపూరితమైంది.

విరుధ్‌నగర్ సమీపములోనున్న చిన్నవల్లికులమ్ ఆశ్రమాన్ని మాస్టరుగారు దర్శించారు. ఆ ప్రాంత అభ్యాసీలతో సమయం సేద తీరినట్లైంది. "నేనిక్కడికి ఎప్పుడు వచ్చినా బాగా నిద్రపోతాను" అని మాస్టరుగారన్నారు. బాబూజీ మహరాజ్‌గారి విరుధ్‌నగర్ పర్యటన సందర్భంగా తీసిన ఫోటో ఆల్బమ్ చూసి, దానిలో అభ్యాసీలను గుర్తించారు. విరుధ్‌నగర్‌లోని టి.టి.కె.సంస్థలో పనిచేసిన తన సహచరులు చాలామంది మరణించారని తెలుసు కొని విచారించారు.

యధావిధిగా, మాస్టరుగారు తనను కలుసుకోవడానికి వచ్చిన ఎంతోమంది అభ్యాసీలను కలిసి, వారి సాధకబాధకాలను తెలుసుకోవడానికి సమయము కల్పించుకున్నారు. సెప్టెంబర్ 3వ తేదీ మాస్టరుగారు విమానంలో చెన్నై వెళ్ళారు.








## చైనాకు మాస్టరుగారి చారిత్రాత్మక పర్యటన (16-23 సెప్టెంబర్ 2008)

మాస్టరుగారు షాంఘైపుడాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరారు. ఇమ్మిగ్రేషన్ పరిష్కారాలు జరిగిన తర్వాత, కారులో కూర్చొని, "చివరికి,చైనాలో ఉన్నాము" అన్నారు. చైనాలో ఉండే ప్రాంతీయ అభ్యాసీలు, ఇతర దేశాల్లోని చైనీస్ అభ్యాసీలు, మాస్టరుగారికి స్వాగతం పలికేందుకు, గ్రీన్‌కోర్టు వద్ద ఆత్రుతగా ఎదురుచూశారు. మాస్టరుగారి బస గ్రీన్‌కోర్టు వద్ద. ఆయన వెంటనే సిట్టింగ్ ఇస్తానని చెప్పి ఇలా అన్నారు. "బీజింగ్ ఒలింపిక్స్‌లాగ టపాకాయలు కాల్చి, లైటు వెలిగిద్దాం." ఆ రూములో ఉన్న వారంతా అభ్యాసీలేనా అని అడిగి వెంటనే ఇలా అన్నారు. "కాకపోయినా ఫరవాలేదు. నేను చైనా మొత్తానికి ప్రాణాహుతి ప్రసారం చెయ్యబోతున్నాను."

మాస్టరుగారు మూడురోజుల సెమినార్ నిర్వహించారు. దాని అంశము "హృదయము యొక్క భాష". 40 మంది అభ్యాసీలున్న గ్రూపుతో, దృశ్య దర్శనానికి, కొనుగోలు చేయడానికి సమయము కల్పించుకున్నారు. కొన్నిసార్లు భోజనం తర్వాత మాట్లాడేవారు. చైనా గురించి మాట్లాడుతూ, చైనా అభ్యాసీలను ఆశీర్వదించారు. తానిప్పుడు వేసిన బీజాలు భవిష్యత్తులో మంచి పంటనిస్తా యన్నారు. చైనాలోని షాంక్షీ రాష్ట్రములోని జియాన్ నగరంలో సహజమార్గము అభివృద్ధి చెందుతుందని వారన్నారు.





సెమినార్‌లో, ప్రత్యేకించి చైనా ప్రజల నుద్దేశించి ప్రసంగించిన వారి సందేశములో, మాస్టరుగారిలా అన్నారు.

దేశాల వారీగా, మతాల వారీగా మనల్ని మనం ప్రత్యేకించుకుంటాము. భగవంతుడు ఈ తేడాలను సృష్టించలేదు. భగవంతుడు మానవులను, ప్రేమను తప్ప వేరే దేనినీ సృష్టించలేదు.

మనం మొదట మానవులుగా మారాలి, తర్వాత ఇతరులు మానవులుగా మారేందుకు సహాయపడాలి.

ఎంపికను నీముందుంచి, ఆ ఎంపిక ద్వారా నీవు జీవించి, నీవు పోగొట్టుకున్న అంతర్గత స్వేచ్ఛను తిరిగి పొందటానికి నీకు సహాయపడేందుకు మేమిక్కడికి వస్తుంటాము. సహజమార్గము స్వేచ్ఛకు మార్గము.

**"ఆయన్ను సేవించడానికి నిజంగా మనం ఇష్టపడుతున్నామా?**

**అందుకు కావలసిన గుణాలు CAD :**

**C - అంకిత భావము (Commitment)**

**A - ఆచరణ (Application)**

**D - దృఢ నిశ్చయము (Determination)**

**పి. రాజగోపాలాచారి–చైనా, 2008**

## మాస్టరుగారి హైదరాబాదు పర్యటన

మాస్టరుగారు చెన్నై నుండి 11-10-2008, శనివారము హైదరాబాదు వచ్చారు. కొన్నివేల మంది అభ్యాసీలు, మెయిన్‌గేటు నుండి కాటేజి వరకు, క్రమశిక్షణతో నిశ్శబ్దముగా నిలబడి, మాస్టరుగారికి స్వాగతం పలికారు. మాస్టరుగారు ధ్యానమందిరములో సాయంత్రపు సత్సంగ్ నిర్వహించారు.

ఈ పర్యటనలో మాస్టరుగారు ఆంధ్రప్రదేశ్‌లోని భిన్న ప్రాంతాలనుండి వచ్చిన అభ్యాసీలను కలుసుకొని, పరిపాలనాపరమైన విషయాలను చర్చించారు. నలుగురు క్రొత్త ప్రిసెప్టర్లను తయారుచేశారు. వారు సంతోషంగాను, విశ్రాంతి తీసుకున్నట్లు కన్పించారు.

12వ తేదీ ఆదివారం, ఉదయం సత్సంగ్ తర్వాత, మాస్టరుగారు మూడు వివాహాలు జరిపించారు. దీని తర్వాత మాస్టరుగారు ఇలా మాట్లాడారు, "నా పనిలో రెండు అంశాలున్నవి. 1) నా మాస్టరుగారు, పని చేయడానికి నాకిచ్చిన అనుమతి కంటె నేనెక్కువ చేయలేను. 2) ఆయన అనుమతించినది చేయడానికి, నాకు దృఢ సంకల్పము, శక్తి కావాలి. మూడవది అన్నిటికన్న ముఖ్యమైనది. ఆ పనిని మీరు అనుమతించి, మీలో సత్ఫలితాల నివ్వడానికి, మీ సహకారము కావాలి. సహకారము అంటే సహజమార్గ దశనియమాల కనుగుణంగా జీవిస్తూ, సాధన సక్రమంగా చేస్తూ, అంతరంగంలోను, బాహ్యంగాను క్రమశిక్షణతో, భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను క్రమశిక్షణ పాటిస్తూ, ఇంట్లోను బాహ్య ప్రపంచంలోను క్రమశిక్షణతో, ముఖ్యంగా మీ ఆలోచనలను క్రమబద్ధీకరించేందుకు క్రమశిక్షణ పాటించాలి. ఎందుకంటే అన్ని సమస్యలకు ప్రారంభం అక్కడే గనుక".





ఆదివారం మధ్యాహ్నము ప్రిసెప్టర్ల సమావేశము జరిగినది. 125 మందికి పైగా, ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చినవారు పాల్గొన్నారు. మాస్టరుగారు అక్టోబరు 8వ తేదీ ఇచ్చిన సందేశాన్ని, ఆరోజు ఉదయం చేసిన ప్రసంగాన్ని ఆలోచించేందుకు, ప్రిసెప్టర్లకు అవకాశం లభించింది. మాస్టరుగారు ఆ తర్వాత వచ్చి, ప్రిసెప్టర్లనుద్దేశించి మాట్లాడారు, సిట్టింగు ఇచ్చారు.

వారు ఆ సాయంకాలపు సత్సంగ్ నిర్వహించారు. తాను వచ్చినపని త్వరగా పూర్తి చేశారు కనుక, ఒకరోజు ముందుగా వెళ్ళిపోవడానికి నిర్ణయించారు.

సోమవారము మాస్టరుగారు, సుమారు ఐదు సంవత్సరాల తర్వాత దోమల్‌గూడ యోగాశ్రమానికి వెళ్ళారు. మాస్టరుగారు ఆ సాయంకాలపు సత్సంగ్ నిర్వహించి, ఆ రాత్రి ఆశ్రమంలో విశ్రాంతి తీసుకున్నారు. మంగళవారం ఉదయం మాస్టరుగారు కోల్‌కత వెళ్ళారు.





## నీతి మరియు నడవడిక

### అన్నా విశ్వవిద్యాలయము, చెన్నై

ఆగస్టు 21, 2008న, అన్నా విశ్వవిద్యాలయ ఆవరణలోని ప్రింటింగ్ టెక్నాలజీకి చెందిన 125 ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆరుగురు అధ్యాపకులకు ప్రసంగము, ప్రశ్నోత్తరాల సమావేశము రెండు గంటల సేపు నిర్వహించబడినది. యస్.ఆర్.సి.యమ్. (SRCM) జాయింట్ సెక్రటరీ సో॥ ఎ.పి. దొరైగారు, “గమ్యానికి మార్గము నీతి, నైతికతలే” అన్న అంశముపై ప్రసంగించారు. సహజమార్గ దృక్పథాన్ని – దానిని గురించి మాస్టరుగారు అప్పుడప్పుడు చెప్పిన వాటిని తెల్పారు. నీతి, నీకు, ఇతరులకూ సంబంధించినది. నడవడిక నీకు మాత్రమే సంబంధించినది. నీ భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక పద్ధతులకు నష్టము వాటిల్లకుండా, ఆలోచించి అనుసరించేది.

చాలమంది విద్యార్థులు మాస్టరు గురించి, మిషన్ గురించీ ప్రశ్నించారు. బాబూజీ మెమోరియల్ ఆశ్రమ్ చూడాలన్న కోరికను వ్యక్తము చేశారు. సీనియర్ లెక్చరర్, క్రొత్త అభ్యాసి అయిన శ్రీ కె. విపినేంద్రన్ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.





## ప్రచురణలు – నూతన విడుదలలు



దీపావళికి విడుదలైన DVD లో రెండు తమిళ ప్రసంగాలున్నవి.

**తిరుప్పూరులో, ధ్యానమందిర ప్రారంభోత్సవం**
2-3-2008 – 25 నిమిషాలు

**మధురైలో చేసిన ప్రసంగము**
31-8-2008 – 20 నిమిషాలు

## ఆశ్రయ వృద్ధాశ్రమము

మాస్టరుగారి ఆశీస్సులతో, “ఈరోడ్” లోని ఆశ్రయ వృద్ధాశ్రమ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సుమారు 250 మంది అభ్యాసీలు పాల్గొన్నారు. ఒక సోదర అభ్యాసి దీనిని నిర్మిస్తున్నారు.

తిరుప్పూరు నుండి కొద్దిమంది అభ్యాసీల రాకతో, ఉత్సవము ఉదయము 7 గంటలకు ప్రారంభమైనది. సత్సంగ్ తర్వాత కొందరు సోదరులు సంఘము-వృద్ధుల క్షేమమును గురించి సహజమార్గ నిర్దేశాలు తెలియ పర్చారు.

పాల్గొన్న వారందరూ శ్రద్ధగా విన్నారు. మాస్టరు గారి ఆశీస్సులతో చక్కటి వాతావరణాన్ని అందరూ అనుభవించారు.



## అంతర్జాతీయ శాంతి దినము



ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ శాంతి దినాన్ని, ప్రపంచవ్యాప్తంగా ఉండే కేంద్రాలలో, సెప్టెంబర్ 21వ తేదీన ప్రార్థనా సమావేశాలతో జరుపుకున్నారు. గుజరాత్‌లోని, బుధవారం జరిగే సత్సంగ్‌లకు, అభ్యాసీల స్నేహితులను, తోటి ఉద్యోగస్తులను ఆహ్వానించారు. లక్నోలో జూలై 23వ తేదీ మాస్టరుగారు చేసిన ఆంగ్ల ప్రసంగాన్ని, ఆడియో టేపుల ద్వారా విన్పించడమో లేక చదవడమో జరిగింది. ప్రార్థన తర్వాత విన్పించిన ఈ ప్రసంగము ద్వారా, ఆహ్వానితులకు సహజమార్గమంటే ఏమిటో చక్కటి అవగాహన కల్గింది.

## మంగళూర్, కర్నాటక

ఆగస్టు 24వ తేదీ సో॥ మోహనదాస్ హెగ్డే, మంగళూరు కేంద్రములో అడ్వాన్స్ శిక్షణా సెమినార్ నిర్వహించారు. సంస్థను గురించి సరియైన అవగాహన కల్గియుండటంతో, అభ్యాసీల ఆధ్యాత్మిక ప్రగతికి ఇది ఉద్దేశింప బడినది, మరియు మాస్టరుగారి నుండి నిరంతరము లభించే ఆధ్యాత్మిక సహాయాన్ని అభ్యాసీలు పొందవచ్చు.

సహజమార్గ మూలసూత్రాలను విశదీకరించడం, క్రొత్త అభ్యాసీలకు, పాత అభ్యాసీలకు కూడ ఉపయోగపడింది. భండారాలకు వెళ్ళవలసిన ఆవశ్యకత, మాస్టరుగారి యందు ప్రేమను పెంపొందించు కోవడం, ప్రార్థన యొక్క ప్రభావము విశదీకరించబడినవి. మాస్టరుగారు దుబాయ్‌లోని అభ్యాసీలతో, ఒక స్థితిని ఏ విధంగా సృష్టించుకోవచ్చో తెలిపే వీడియో క్లిపింగ్ ప్రదర్శింపబడినది. మాస్టరుగారు అభ్యాసీలో ఒక పరమానంద స్థితిని సృష్టిస్తే, ఆ అభ్యాసి, ఆ స్థితిని మళ్ళీ గుర్తుపెట్టుకొని, ఆ స్థితిని వీలైనంత ఎక్కువ కాలము నిలుపుకోవాలి.

## కొడైకెనాల్, తమిళనాడు

మధురై కేంద్ర అభ్యాసీలు, కొడైకెనాల్ ప్రాంతీయ అభ్యాసీలు, సహజమార్గాన్ని ఈ వేసవి విడిదికి, తీసుకొని వెళ్ళుటలో కృతకృత్యులయ్యారు.

**బృందావన్ పబ్లిక్ స్కూల్:** సెప్టెంబర్ 12వ తేదీ బృందావన్ పబ్లిక్ స్కూల్లో 20 మంది అధ్యాపకులకు సహజమార్గాన్ని గురించి తెలుపబడింది. మాస్టరు, మిషను, పద్ధతి, వీటివల్ల కలిగే అనుభవపూర్వక లాభాలు విశదీకరించబడినవి. కొద్దిమంది ఉపాధ్యాయులు సంస్థలో చేరడానికి ఉత్సాహము చూపారు. ప్రిన్సిపాల్ శ్రీ మున్నాసింగ్ గారు, చక్కటి సహకారాన్ని అందివ్వటవమే కాకుండా, ఉపాధ్యాయులకు త్వరలో VBSE శిక్షణా పరిచయము చేయటానికి అంగీకరించారు.

గ్రామీణాభివృద్ధిని బోధించే **శ్రీ జయేంద్ర సరస్వతి కళాశాల**లో రెండు రోజుల కార్యక్రమము నిర్వహించబడినది. సెప్టెంబరు 26, 2008న మొదటిరోజుగా పదిమంది అధ్యాపకులకు, రెండవ రోజు 100మంది విద్యార్థులకు సహజమార్గములో ధ్యానాన్ని గురించి తెల్పబడినది. 15 మంది విద్యార్థులు సాధన ప్రారంభించాలనుకున్నారు. ఈ కార్యక్రమాలను, ప్రాంతీయ అభ్యాసులైన సో॥ ప్రసాద్ మరియు వి.సి. రావుగార్లు నిర్వహించారు.



## శిక్షణా కార్యక్రమాలు

### పన్‌షెట్ రిట్రీట్ సెంటర్ – పూనె

"మాస్టరుగారితో సామీప్యతను అభివృద్ధి చేసుకోవడం" అనే అంశముతో మహారాష్ట్ర SRCM యువత సమావేశము పన్‌షెట్ రిట్రీట్ సెంటరులో, అక్టోబరు 4, 5 తేదీలలో ఏర్పాటైనది.

రిట్రీట్ సెంటరు ప్రశాంత వాతావరణము, కార్యక్రమ నిర్వహణకు ఎంతో అనువైనది. 40 మంది అభ్యాసీలు, నిర్వాహక బృందము ఉన్నారు. మాస్టరుగారితో అనుబంధము, సహజమార్గానికి మార్గదర్శకులుగా యువత కర్తవ్యము, మున్నగు అంశాలతో పాటు, సహజమార్గ సాధనలోని ప్రాథమిక అంశాలను గుర్తుచేయడం జరిగింది.

ప్రసంగాలకు మధ్య మధ్య – సినిమాలు, క్విజ్, ఆటలు, కొన్ని ముఖ్యమైన పవర్‌పాయింట్ ప్రదర్శనలు, మాస్టరుగారి ప్రసంగాలలో చమక్కులు, సంగీతము చోటు చేసుకున్నవి. పూనే అభ్యాసీలు చేసిన ఆహారము, వసతి సౌకర్యాలు, కురిపించిన ప్రేమ, తీసుకున్న శ్రద్ధ, పాల్గొన్న వారికి మధురానుభూతులుగా మిగిలాయి.

### ఘజియాబాద్, యు.పి.

సెప్టెంబరు 28 న ఏర్పాటుచేయబడిన ఈ కార్యక్రమములో, రెండు సంవత్సరాలలోపు నుండి సాధన చేస్తున్న 50 మంది అభ్యాసీలు పాల్గొన్నారు. వీరు ఘజియాబాద్, సహీబాబాద్, నోయిడాలకు చెందినవారు. సిద్ధాంత భాగాన్ని తెలుసుకునేకన్నా, ఖచ్చితంగా, క్రమంగా సాధన చేయడానికి ప్రాముఖ్యత నివ్వబడినది.

సాధనకు సంబంధించిన విషయాలు, సరళంగా, ఫలవంతంగా విశదీకరించ బడినవని, పాల్గొన్నవారనుకున్నారు. పుస్తకాలు చదివిన తర్వాత కూడ, నిర్మలీకరణ, నిరంతర స్మరణకు సంబంధించిన అనుమానాలు నివృత్తి చేయబడినవి. క్రొత్త అభ్యాసీలకు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలను ఇనుమడింపజేయాలి.

### జమ్ము

సెప్టెంబరు 26న, అక్టోబరు 9న "ఓపెన్ హౌస్" కార్యక్రమాలు నిర్వహించ బడినవి. ఒకటి "జెనిసిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాంపెటీటివ్ స్టడీస్" లో నిర్వహించబడినది. దీనిలో 21-25 సంవత్సరాల వయసు గలవారు 35 మంది పాల్గొన్నారు. సహజమార్గము సమతుల్య జీవన విధానమని వీరికి చెప్పబడినది.

రెండవ కార్యక్రమము, జమ్ము నుండి 90 కి.మీ. దూరములో నున్న జ్యోతి పురములో నిర్వహించబడినది. NHPC ఉద్యోగుల కొరకు, 40-45 సం॥ వయసున్నవారికి, "ఆధ్యాత్మికతలో ఇదొక క్రొత్త కిరణము" అని చెప్పబడినది.

రెండు కార్యక్రమాలకు మంచి స్పందన లభించింది. 15మంది సాధన ప్రారంభించడానికి ఉత్సాహము చూపించారు.



### హైదరాబాద్, ఎ.పి.

సెప్టెంబరు 28వ తేదీ, ఆదివారం, ఎస్.ఆర్. నగర్ ధ్యానకేంద్రములో 120 మంది క్రొత్త అభ్యాసీలకు వర్క్‌షాప్ నిర్వహించబడినది. ఒక సంవత్సరంలోపు నుండి సాధన ప్రారంభించిన అభ్యాసీల కోసం ఇష్టాగోష్టి వర్క్‌షాప్ నిర్వహించబడిది. మామూలుగా క్లాస్ రూములో పాఠాలు చెప్పినట్లుగా కాక, ఇలాంటి ఇష్టాగోష్టి కార్యక్రమమే బాగుందని పాల్గొన్నవారి అభిప్రాయము. "వెల్‌కం టు సహజమార్గ్" అనే చిన్ని పుస్తకములోని అంశాలన్నిటినీ చర్చించారు. అన్ని అంశాలనూ, క్షుణ్ణంగా, స్వేచ్ఛగా చర్చించారు. "సహజమార్గ సాధన" అనే మాస్టరుగారి ఆడియో వినడంతో, ఆనాటి కార్యక్రమం ముగిసింది.

### తిన్ సుకియా



తిన్ సుకియా ఆశ్రమంలో 64మంది అభ్యాసీలకు, డిబ్రూగర్ కేంద్రములో 19 మంది అభ్యాసీలకు, సెప్టెంబరు 19వ తేదీ, అభ్యాసీల శిక్షణా కార్య క్రమము నిర్వహించ బడినది. సో॥ సేన్‌గుప్తా, మాస్టరుగారి స్లైడ్లు చూపించారు. మాస్టరుగారికి శరణాగతి పొందటం, అంత తేలికకాదని, వారి పనిలో పాలు పంచుకోవడంవల్ల అది సుసాధ్యమని చెప్పారు.

### ఒకరోజు పూర్తి కార్యక్రమము – బీదర్, కర్నాటక

మన సంస్థ జాయింట్ సెక్రటరీగా నున్న సో॥ ఎ.పి. దొరై గారిచే సెప్టెంబరు 21వ తేదీ, ఆదివారం బీదర్‌లో ఒకరోజు పూర్తి కార్యక్రమము నిర్వహించ బడినది. ఉత్తర కర్నాటక జోనల్ ఇన్‌ఛార్జి, సో॥ రాజు కషంపూర్‌కర్ మరియు బీదర్, భాల్కి, ఛానాకుష్‌నూర్, గుల్బర్గా కేంద్రాలనుండి సుమారు 50 మంది అభ్యాసీలు, ఈ కార్యక్రమములో పాల్గొన్నారు. ఉదయం సత్సంగ్ తర్వాత జరిగిన చర్చా కార్యక్రమములో, అందరు అభ్యాసీలు చురుకుగా పాల్గొన్నారు. చర్చనీయాంశము – సంస్థను అభివృద్ధి పరచడానికి, మన కేంద్రాలలో ఏం చెయ్యాలి. చాలామంది అభ్యాసీలు వారి అభిప్రాయాలను వ్యక్తీకరించారు. "ఓపెన్‌హౌస్‌లు" మరియు "హోమ్ గాదరింగ్స్" నిర్వహణ. మనము సంస్థకు ఆదర్శమైన అభ్యాసీలుగా తయారవ్వడం లాంటి అభిప్రాయాలు వెల్లడించారు. మధ్యాహ్నము, హబుల్‌బబుల్ డివిడిల నుండి ఒకదానిని ప్రదర్శించడం జరిగింది. మొత్తానికి అదొక మంచి ఇష్టాగోష్టి కార్యక్రమము. రోజంతా నేర్చుకున్నట్లే ఉంది. అది అభ్యాసీలలో ఉత్సాహాన్ని రేకెత్తించి, నూతన తేజముతో సాధన ప్రారంభించేందుకు దోహదపడింది.



## హైదరాబాదులో VBSE ప్రోగ్రాముల ఉధృత

హైదరాబాదులోని VBSE కేంద్రము, విద్యాపరంగా అభ్యాసీలకు, ఆధ్యాత్మిక విలువలను సాధన చేసే విద్యార్థులకు నిరంతరంగా శ్రద్ధను చూపుతోంది.

ఉస్మానియా వైద్య కళాశాలలోని ప్రథమ సంవత్సరపు విద్యార్థులకు ఆగస్టు 22 తేదీ "లైఫ్ ఇన్ పర్స్పెక్టివ్" (జీవిత దర్శనము) మరియు "గమ్యాన్ని నిర్ధారించుకోవడం" అనే అంశాలపై రెండున్నర గంటలసేపు ఇష్టాగోష్టి కార్యక్రమము నిర్వహించబడినది. కార్యక్రమములో పాల్గొన్నవారు, విజ్ఞానాత్మకంగాను, విద్యాపరంగాను, ఉత్తేజకరం గాను, మనస్సుకు హత్తుకునేట్లుగాను, శుభ్రం చేసినట్లు గాను అనిపించిందని వారి భావాలను వెల్లడించారు.

సెప్టెంబరు రెండవ వారాంతములో, నంద్యాలలోని SPY రెడ్డి పాఠశాలలో ఆ ప్రాంతము లోని 38 మంది అధ్యాపకులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్య, ఉపాధ్యాయుల పాత్ర, ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలల పాఠ్య ప్రణాళిక, విలువలు, జీవితము దాని నిజమైన దర్శనము, విలువలను బోధించుటకు గణితము, మనస్సును క్రమబద్ధీకరించుట మున్నగు అంశములు చర్చించబడినవి.

సెప్టెంబరు 7వ తేదీ అభ్యాసీలకు VBSE గురించిన "ఓరియంటేషన్ ప్రోగ్రామ్" నిర్వహించబడినది. దీని తర్వాత సెప్టెంబరు 20 మరియు 21వ తేదీలలో 65 మంది అభ్యాసీలకు పూర్తిస్థాయి శిక్షణా కార్యక్రమము నిర్వహించబడినది. వివిధ ప్రసంగాలను వినడం మాత్రమే కాకుండా, విలువల ఆధారిత ఆటలు, బృంద కార్యక్రమాలైన పాటలు, స్కిట్స్ మున్నగువాటిలో చురుకుగా పాల్గొనే విధంగా ప్రోత్సహించడమైనది. పాఠశాలలకు వెళ్ళి, విలువల ఆధారిత విద్యా కార్యక్రమాలను గురించి ఏ విధంగా చెప్పాలో, కార్యక్రమాన్ని ఎలా నిర్వహించాలో, మున్నగువాటిని వారికి తెల్పారు.

సెప్టెంబరు 28వ తేదీ, జోనల్ ఆశ్రమంలో, "ఇ&యల్" విద్యా సంస్థల ఉపాధ్యాయులకు VBSE గురించిన సదస్సు నిర్వహించబడినది. కార్యక్రమములో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఆశ్రమ వాతావరణము చాలా నచ్చినది. ఈ సదస్సు తమలో ఎంతో మార్పును తీసుకొచ్చిందనీ, తద్వారా తాము బోధించే విద్యార్థులలోను, పాఠ్య ప్రణాళికలోను మార్పు రాగలదని అన్నారు.

### ఘజియాబాద్ - యు.పి.

ప్రాంతీయ శిక్షణా కళాశాలలోని 70 మంది బి.ఇడి. విద్యార్థులకు ఆశ్రమంలో VBSE "వర్క్‌షాప్" నిర్వహించబడినది. కళాశాల ప్రిన్సిపాల్ ఆయా విభాగాల అధిపతులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్న ఈ సదస్సులో, విలువల ఆవశ్యకతను, ధ్యానము ద్వారా మనస్సును క్రమబద్ధీకరించడం యొక్క ప్రాముఖ్యతను ముఖ్యంగా గుర్తించారు.

ఆత్మ యొక్క ప్రాముఖ్యత, మనస్సును నిర్మలీకరించుట, నేనెవరిని?, మానవ శరీరంలో మనస్సు పాత్ర ఏమిటి?, మనస్సును ఉపయోగించి ఆత్మతో అనుసంధానించుట, మనలోని స్థూల్యాన్ని పోగొట్టుకోవడం లాంటి విషయాలు తీసుకోబడినవి. ఈ భావనలు అర్థమయ్యేందుకు వీలైనచోట్ల ప్రయోగ పూర్వకంగా విశదీకరించబడినవి.

సహజమార్గ సంస్థను గురించీ, ధ్యానాన్ని గురించీ క్లుప్తంగా చెప్పటం జరిగింది. 5 నిమిషాల ప్రార్థనా ధ్యానంతో సమావేశము ముగిసింది. విద్యార్థులు, అధ్యాపకులు అనుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమాన్ని సోదరి చందర్‌కాంత, సో॥ అంకూర్ నిర్వహించారు.

## రాంచీలో VBSE

### సేంట్ అలోసియస్ పాఠశాల

వ్యాసరచన పోటీ ఫలితంగా, సెప్టెంబరు 2వ తేదీ పాఠశాల ఆడిటోరియంలో ఒక కార్యక్రమము పెట్టబడినది. ఆరోజు పాఠశాలకు సెలవు ప్రకటించారు. అందుచేత మాంటిస్సోరి ఉపాధ్యాయులు, ప్రైమరీ సెకండరీ పాఠశాలల ఉపాధ్యాయులు, ఏ ఇబ్బందీ లేకుండా "వర్క్‌షాప్"లో పాల్గొనడానికి వీలు కలిగింది.

ఈ కార్యక్రమాన్ని సో॥ అరుణ్‌కుమార్ లాల్ మరియు పాఠశాల ప్రిన్సిపాల్ సో॥ సిల్వెస్టర్ సూరిన్ ప్రారంభించారు. ఆ పాఠశాల పూర్వ విద్యార్థి సో॥ మనోజ్ తివారి పరిచయ వాక్యాలు పలుకుతూ, సంస్థ యొక్క విభిన్న భాగాలైన SMSF, SMRTI మరియు SMRTI కి ప్రారంభములో నున్న VBSE గురించి విశదీకరించారు.

అభ్యాసీ సోదరీసోదరులతో VBSE సదస్సు పూర్తయిన తర్వాత, సో॥ గిల్బర్ట్ పింటో, వందనసమర్పణ చేశారు. రాంచి కేంద్ర అభ్యాసీలకు కృతజ్ఞత తెల్పుతూ, పాఠశాల పూర్వ విద్యార్థి ఎంతో ఉత్సాహంతో, పాఠశాల విద్యార్థుల శ్రేయస్సుకోసం ఈ సదస్సు నిర్వహించడం తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందని అన్నారు.

### ఉర్సులిన్ పాఠశాల

సేంట్ అలోసియస్ పాఠశాలలో నిర్వహించబడిన VBSE కార్యక్రమాన్ని గురించి విన్న ఉర్సులిన్ సోదరిలు, తమ పాఠశాలలోని అధ్యాపకులకు కూడ అటువంటి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించవలసినదిగా సో॥ ముఖేష్ తనేజాని కోరారు.

సెప్టెంబరు 27వ తేదీన, ఉర్సులిన్ సంస్థల్లో పనిచేస్తున్న, మాంటిస్సోరి, ప్రైమరీ, సెకండరీ పాఠశాల మరియు ఇంటర్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులకు VBSE వర్క్‌షాప్ నిర్వహించబడినది. సేంట్ అలోసియస్ పాఠశాల నుండి వచ్చిన VBSE విషయ సంగ్రహణతో ఇక్కడి కార్యక్రమము క్లుప్తముగా, ఎక్కువమంది ఉపాధ్యాయులు పాల్గొనడానికి వీలుపడినది.

VBSE కార్యక్రమాన్ని కనీసం రెండు పాఠశాలల్లో క్రమం తప్పకుండా నిర్వహించ బడతాయి. ఆ విధంగా SRCM లో మాస్టరుగారి కార్యక్రమాన్ని ఎక్కువమందికి తెలియజేస్తూ, చిన్నారులలో విలువల యొక్క విలువను గుర్తించేట్లు చేయడం సాధ్యపడుతుంది.



### బరౌని, బీహార్

సెప్టెంబరు 29వ తేదీన బరౌనీలో అభ్యాసీలకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు VBSE కార్యక్రమము నిర్వహించబడినది. పాట్నా సెంటరునుండి వచ్చిన సో॥ డా॥ విజయకుమార్, ప్రస్తుత విద్యావిధానములో నున్న విలువల స్థితిని, విలువల ఆధారిత విద్యను విద్యార్థులకు ఎన్నో విధాలుగా అందించవచ్చని తెలిపారు. ధనబాద్ సెంటరు నుండి వచ్చిన సో॥ దీప్తి ప్రయోగాల ద్వారా విలువల ఆధారిత విద్యను, విద్యార్థులకు ఎలా నేర్పవచ్చునో చేసి చూపించారు.

## ఓపెన్‌హౌస్ సదస్సులు

### బరౌనీ రిఫైనరీ ట్రైనీ ఇంజనీర్లు

సెప్టెంబరు 20న 10CL రిఫైనరీ విభాగములో పనిచేస్తున్న 30 మంది ప్రొబేషనరీ ఇంజనీర్లకు, స్ట్రెస్ నిర్వహణ, స్వయం వికాసముల గురించిన వర్క్‌షాప్ నిర్వహించబడినది. రిఫైనరీలోని ఉన్నతాధికారులు దీనిలో పాల్గొన్నారు. పని భారాన్ని ధ్యానము ద్వారా ఏ విధంగా నిర్వహించవచ్చు అన్న అంశముపై చర్చను, సో॥ప్రబోధ్ సంఘ్వి ప్రారంభించారు.

"స్వయం వికాసములో ధ్యాన ప్రభావము" అన్న అంశముపై సదస్సును డా॥ జి.యం. భట్నాగర్ ప్రారంభిస్తూ, సహజమార్గములో, ఆధ్యాత్మిక సాధన స్వయం వికాసానికి ఎలా ఉపకరిస్తుందో చెప్పారు. ఈ సదస్సుకు బెగుసరై నుండి, పరాసర కేంద్రాలనుండి అభ్యాసీలు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

### రామ్‌నగర్, ఉత్తరాఖండ్

సో॥ ఎన్.వి. సింగ్, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ గారి ఆహ్వానంతో, అటవీశాఖ నుండి 52 మంది ఉద్యోగులు "ఓపెన్ హౌస్" కార్యక్రమంలో పాల్గొన్నారు. సంస్థ ప్రిసెప్టర్లు, "ఆధ్యాత్మికత పిలుస్తోంది" అన్న విషయాన్ని గురించి మాట్లాడినప్పుడు, అందరూ ఎంతో శ్రద్ధతో ఆలకించారు. ప్రశ్నోత్తరాల సమయంలో వారు చూపిన ఉత్సాహము సహజమార్గాన్ని గురించి ఇంకా తెలుసుకోవాలనే ఆసక్తిని తెలుపుతోంది.

### ఉజ్జయిని

ఈ కేంద్రములోని సోదరీసోదరుల ఆహ్వానంపై సుమారు 110మంది ఆధ్యాత్మికాభిలాషులు అక్టోబరు 5న సమావేశమయ్యారు. ఈ "ఓపెన్‌హౌస్" రెండు ప్రసంగాలతో ప్రారంభమైనది. "మానవ జీవిత గమ్యము" మరియు "సాధనలోని మూలాంశాలు". సో॥ సంజయ్ ఖండేల్‌వాల్ "మాస్టరు, మిషను" గురించి ప్రసంగించారు.

ప్రోగ్రామ్ చివర్లో ప్రశ్నోత్తరాలను సో॥ వికల్ప్ ముంద్రా మరియు సో॥ వై.జి. జోషి నిర్వహించారు. సుమారు 80 మంది అతిథులు ఈ కార్యక్రమము నచ్చిందని, SRCM లో చేరడానికి తమ అంగీకారాన్ని తెల్పారు.

### అహ్మదాబాద్




"ధ్యానము ద్వారా మనస్సు నియంత్రణ" అన్న అంశముపై సెప్టెంబరు 28వ తేదీ "ఓపెన్‌హౌస్" కార్యక్రమము జరిగినది. ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు దీనికి ఆహ్వానించబడినారు. ఫలితంగా విద్యార్థులు, అభ్యాసీలుగా సిట్టింగులు తీసుకున్నారు.

విశాలమైన నిర్మా విశ్వవిద్యాలయ ఆవరణలో, నిర్మా విశ్వవిద్యాలయ అధ్యాపకుల కొరకు, అహ్మదాబాద్‌లో "స్ట్రెస్ నిర్వహణ" అన్న అంశముపై తెలియజెప్పారు. సర్వరోగ నివారిణిలాగ, ధ్యానము యొక్క ఆవశ్యకతను, ఒత్తిడిని ఫలప్రదంగా నిర్వహించడానికి, సమర్థతను పెంచడానికి, దీని సార్థకతను తెల్పారు.

అధ్యాపక బృందము దీనిని పూర్తిగా అంగీకరించారు. ఆనాటి వక్త, మిషన్ అధికారిని, తమ సంస్థాపక దినోత్సవములో, విద్యార్థులనుద్దేశించి ప్రసంగించ వలసినదిగా ఆహ్వానించారు.

### BHEL, హైదరాబాద్

"ధ్యానము ద్వారా మనస్సు నియంత్రణ" అన్న అంశముపై జరిగిన ఒక రోజు పూర్తి కార్యక్రమములో, సెయింట్ జేవియర్స్ పి.జి. కళాశాల విద్యార్థులు 75 మంది, డిగ్రీ కళాశాల పండితులు, రావు కామర్స్ సంస్థవారు ఎంతో ఉత్సాహంతో సెప్టెంబరు 20న పాల్గొన్నారు. మిషన్ గమ్యాన్ని గురించి, యువతకు ధ్యానం యొక్క ప్రాముఖ్యతను గురించి, వ్యక్తిగత మార్పుద్వారా, సంఘములో మార్పు తేవచ్చు మున్నగు విషయాల గురించి తెలియజెప్పారు. ఆటలు, ప్రశ్నోత్తరాలు, మాస్టరుగారి ప్రసంగంలో వీడియో క్లిప్పింగుల ద్వారా అవగాహన మరింత పెరిగింది. పాల్గొన్నవారిలో 30 మంది, సాధన ప్రారంభించడానికి ఆసక్తి చూపారు. BHEL కేంద్రము వారు, వారికి సిట్టింగులు ఇప్పించే బాధ్యతను తీసుకున్నారు.

### సిబ్‌సాగర్, అస్సాం



సెప్టెంబరు 20వ తేదీన సో॥ సుధీర్ భాటియా సిబ్‌సాగర్ జిల్లాలో నిర్వహించిన రెండు "ఓపెన్ హౌస్" సదస్సులకు, అభ్యాసీలు జోర్‌హాత్, నాజిరా, తిన్‌సుకియా నుండి హాజరయ్యారు. ఉదయపు సదస్సుకు ఎక్కువమంది వ్యాపారస్తులు, కొద్దిమంది పత్రికా విలేకరులు, చదువుకున్న వారు అతిథులుగా వచ్చారు. సాయంత్రపు సదస్సుకు "ఆయిల్ ఇండియా" మరియు ప్లాంటర్స్ కుటుంబాలనుండి 17 మంది అతిథులు వచ్చారు. మరుసటి రోజు 9 మందికి పరిచయాత్మక సిట్టింగులు ఇవ్వబడినవి.

### ముస్సోరి, ఉత్తరాఖండ్

ముస్సోరిలో, దేశంలోని ప్రధాన పరిపాలనా శిక్షణాసంస్థ అయినటువంటి లాల్ బహదూర్ శాస్త్రి జాతీయ పరిపాలనా అకాడమీ నందు సహజమార్గాన్ని అందరి దృష్టికి తెచ్చారు. 2008, ఏప్రిల్, మే నెలల్లో – 1995లో ఉత్తీర్ణులైన ఐఏయస్ ఆఫీసర్లు 110 మంది, "మిడ్ కోర్స్" శిక్షణా కార్యక్రమములో ఉన్నారు. గాంగ్‌టాక్ కేంద్రము నుండి వచ్చిన రవీంద్ర తెలాంగ్, మరియు భోపాల్ కేంద్రానికి చెందిన సచిన్ సిన్హా, ఇద్దరూ ఐఏయస్ ఆఫీసర్లు కావడంతో, ఇష్టాగోష్టి చర్చల్లో, మాస్టరు, మిషను, పద్ధతి గురించి తెల్పారు. "ధ్యానము ద్వారా సమతుల్య జీవనము – ఆధ్యాత్మికపరంగా" అన్న అంశముపై ప్రసంగము, దానిపై చర్చలు జరిగినవి.

2007 బాచ్, ప్రొబేషనరీ ఐఏయస్ ఆఫీసర్లకు కూడ అదే విధమైన అంశములపై చర్చ, మే 31, 2008న జరిగింది. విన్నవారంతా, యోగా, ధ్యానము, దాని వలన ప్రయోజనాలు, మానవతా విలువలు, ఒత్తిడిని నియంత్రించుట – తద్వారా సమతుల్య జీవనము – వీటిపై ఆసక్తి చూపారు. మొత్తానికి 21 మంది ఆఫీసర్లు, 5 మంది కుటుంబ సభ్యులు, శ్రీలంక పరిపాలన సర్వీసు నుండి వచ్చిన ఆఫీసరుతో సహా, పరిచయాత్మక సిట్టింగులు తీసుకొని ధ్యానము ప్రారంభించడమైనది.

సత్సంగ్‌లు నిర్వహించారు. బాబూజీ మహరాజ్ జన్మదినమైన ఏప్రిల్ 30న కూడ ఒక సత్సంగ్ జరిగింది. కొద్దిమంది సోదరులు, డెహ్రాడూన్ ఆశ్రమంలో జరిగిన సత్సంగ్‌లకు హాజరయ్యారు. క్రొత్తగా చేరిన వారికి ఒక సందేశములో మాస్టరుగారు ఆహ్వానము పలుకుతూ ఆశీర్వదించారు. మిషన్ అధికారులను వారితో పని కొనసాగించమని కోరారు.

## ఉత్తర కర్ణాటక

### ఓపెన్ హౌస్ - వాడి

రైల్వేకాలనీ మజ్దూర్ యూనియన్ హాలునందు ఆగస్టు 17న జరిగిన కార్యక్రమానికి 20 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. వారిలో చాలమంది రైల్వే ఉద్యోగులు డా॥ గజేంద్రసింగ్ ముఖ్య ప్రసంగాన్ని హిందీలో చెప్పారు. ఆ తర్వాత సహజమార్గములోని భిన్న అంశాలను సరళమైన భాషలో చెప్పారు. సో॥ రాజు కషంపూర్ సహజమార్గము యొక్క సూక్ష్మాంశాలను తెలియ జెప్పారు. వాడి ప్రిసెప్టరు, సో॥ క్రిష్ణారావు దేశ్‌పాండే, సమావేశానికి ముగింపు చెప్పారు. చర్చలతో ఉత్సాహపూరిత సమావేశము జరిగింది. 5-6 మంది ఔత్సాహికులు, సాధన ప్రారంభించడానికి అంగీకారము తెల్పారు.

### ఛితాపూర్

ఛితాపూర్ విఠల్ మందిరములో ఆగస్టు 24న జరిగిన కార్యక్రమానికి, ప్రాంతీయులు 50 మంది హాజరయ్యారు. సో॥ రాజు కషంపూర్‌కర్, కన్నడలో, మాస్టరు-మిషను గురించి మాట్లాడారు. ఆ తర్వాత డా॥ గజేంద్ర సింగ్, హిందీలో మానవ జీవితానికి నిజమైన గమ్యాన్ని గురించి, సహజమార్గ సాధనా విధానాన్ని గురించి మాట్లాడారు. సో॥ కె. నారాయణరావు ఆధ్యాత్మిక సాధన యొక్క ఆవశ్యకతను, అవసరాన్ని కన్నడలో చెప్పారు. ప్రసంగాలను శ్రద్ధగా ఆలకించారు, కొన్ని ప్రశ్నలడిగారు. వాటికి సమాధానాలు విశదీకరించబడినవి. ఛితాపూర్, ప్రిసెప్టరు సో॥ మధుకర్ నాయక్ కృతజ్ఞతలతో సమావేశము ముగిసినది.

### గుల్బర్గాలో - "హోమ్ గాదరింగ్స్"

సో॥ మహేష్ దేశ్‌పాండే గారింట్లో, ఆగస్టు నెలలో జరిగిన సమావేశానికి, 20-25 సం॥7ల వయస్కులు, 10 మంది హాజరయ్యారు. డా॥ గజేంద్రసింగ్ కన్నడలోను, సో॥ శ్రీకాంత్ జోషి హిందీలోను ప్రసంగించారు. సహజమార్గ సాధనలోని సరళత, ప్రయోజనము ముఖ్యముగా తెల్పబడినది. అందరూ శ్రద్ధగా ఆలకించారు, చివరలో ప్రశ్నలడిగారు. స్పందన చాల బాగుంది. కార్యక్రమము జరిగినంతసేపు, ఆ ఇంట్లో సూక్ష్మఆధ్యాత్మిక వాతావరణముతో, మాస్టరుగారి సన్నిధిలో వున్నట్లుగా అందరూ అనుభవించారు.





### కొప్పాల్

25 మంది ఆధ్యాత్మిక ఔత్సాహికులకు, సో॥ జి.ఎస్. కామత్‌గారు, మరియు సో॥ రాజు కషంపూర్‌గారు, మన సంస్థను గురించి పరిచయం చేశారు. చర్చల తర్వాత, యెల్‌బర్గా, కొప్పాల్ చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమం జరుపబడినది. దాని తర్వాత, సాధన ఏ విధంగా అభివృద్ధి చేయాలి? మన కేంద్రాలను త్వరగా పెరిగేటట్లు ఎలా చేయాలి? అన్న అంశాలపై చర్చించారు. అక్కడ 10 గ్రూపులున్నవి. ఒక్కొక్క గ్రూపు లీడరు తాము చర్చించిన అంశాలను క్రోడీకరించి, అభ్యాసీల దృక్పథాలను తెల్పారు. వివిధ కేంద్రాలైన కొప్పాల్, గంగావతి, బళ్ళారి, కాంప్లికొట్టాల్, ఎల్బర్గా మరియు హుబ్లినుండి వచ్చిన 130 మంది అభ్యాసీలు పూర్తి కార్యక్రమంలో పాల్గొన్నారు. అభ్యాసీలందరూ ఈ కార్యక్రమము నుండి తామెంతో లబ్ధి పొందామని చెప్పారు.

## వ్యాసరచన



ఐక్యరాజ్యాల 'యూత్‌డే' సందర్భం గా, ఐక్య రాజ్యాలు, శ్రీరామ చంద్ర మిషన్‌లు సమిష్టి గా, "ఆల్ ఇండియా వ్యాస రచన పోటీ"ని దేశంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, SRCM ఆశ్రమాలలో నిర్వహించారు. దీని ముఖ్యోద్దేశము పిల్లలలో మరియు యువతలో విలువలను బోధించి, వారిలో సమృద్ధిగా ఉన్న శక్తిని, ఉత్సాహాన్ని, ఆదర్శాన్ని వారిలోని నిర్మొహమాటాన్ని అభివృద్ధిపరచడమే.

10-24 వయసులోనున్న, పిల్లలు, యువత సుమారు 75,000 మంది ఈ వ్యాస రచనలో పాల్గొన్నారు. 10-16 వయసులో నున్న జూనియర్ విద్యార్థులకు "సత్యమే ధైర్యము" అనే అంశము సీనియర్ విద్యార్థులు, 17-24 వయసువారు, "ఆత్మగౌరవము మరియు ఆత్మ విశ్వాసము మనిషి నడవడికను తీర్చిదిద్దుతుంది" అనే అంశములపై పోటీ జరిగినది. వ్యాసములు ఆంగ్లములోను, కొన్ని భారతీయ భాషల్లోను రాయమబడినవి. ఈ పోటీలో పాల్గొన్న విద్యార్థులు మాత్రమే ఆనందించలేదు, వీటిని నిర్వహించిన మిషన్ వలంటీర్లకు నేర్చుకున్న అనుభవము.

ఈ పోటీలో పాల్గొన్న విద్యార్థులు దేశం నలుమూలలనుండీ, పంచకులలోని డూన్ స్కూల్‌నుండి, పంజాబ్ విశ్వ విద్యాలయము వరకు, ఉత్తర ఇండియాలోను, దక్షిణ ఇండియాలో అనేక పాఠశాలలనుండి పాల్గొన్నారు. రాంచిలోని పాఠశాలలో 6500 మంది, ఆంగ్లములోను, హిందీలోను వ్యాసరచనలో పాల్గొన్నారు.

జంషెడ్‌పూర్, ధన్‌బాద్, బొకారో, రామ్‌గర్, లాల్‌పానియా, పాట్నా, సింద్రి మున్నగు కేంద్రాలలో జరిగిన వ్యాసరచన పోటీ, విద్యార్థుల హృదయాలను హత్తుకుంది. కర్ణాటకలోని షిమోగాలో 50 మంది అంధ విద్యార్థులు, 5 నుండి 10వ తరగతివరకు, ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ విద్యార్థులు చెప్పిన దానిని వలంటీర్లు రాశారు.

ఈ వ్యాసరచన పోటీ, వలంటీర్లలో ఏర్పాటుచేసే నైపుణ్యాలను తెలుసుకోవ డానికి సహాయపడింది. ఎక్కువసంఖ్యలో అభ్యాసీలు పాఠశాలలకు వెళ్ళి, ప్రిన్సిపాల్స్‌ను కలిసి, పోటీ నిర్వహించి, చేసిన పనితో, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు తామే తమ పాఠశాలల్లో ఈ పోటీ నిర్వహణ బాధ్యతలు తీసుకోవడం మరింత ఆశ్చర్యం. చాలామంది ఉపాధ్యాయులు, సంస్థ అధిపతులు సహజమార్గ పద్ధతిని గురించి, ధ్యానాన్ని గురించి అడిగి తెలుసు కున్నారు. కొంతమంది ధ్యానసాధన చేయాలని ఉత్సాహం చూపించారు.

ఈ వ్యాసరచన పోటీ ఫలితాలను నవంబరు మాసాంతానికి వెల్లడించవచ్చు. ఆంగ్లములో ఉత్తమమైన మొదటి మూడు వ్యాసాలకు ట్రోఫీలివ్వబడును. మిగిలిన భారతీయ భాషల్లో, ఉత్తమమైన మొదటి మూడు వ్యాసాలకు పుస్తకములివ్వబడును. 60% మించి మార్కులు పొందినవారికి మెరిట్ సర్టిఫికెట్‌లు ఇవ్వబడును.

# జ్యోతి కేంద్రాలు

## మరో జ్యోతికేంద్రము తయారౌతోంది: సేవాశ్రమ్ - తిరువనంతపురం







కేరళకు ముఖ్యపట్టణమైన తరువనంతపురంలో, అరువిక్కర డామ్ దగ్గర ఆశ్రమానికి చక్కటి స్థలము లభించింది. ట్రావెన్‌కూర్ మహారాజా వారి కుటుంబము సత్సంగ్‌లో పాల్గొన్న రోజుల్లో, వారి అతిథులుగా మాస్టరుగారు, బాబూజీ మహరాజ్‌తో ఈ పట్టణాన్ని దర్శించారనేది గుర్తుంచుకోవలసిన విషయము. అరేబియా సముద్రానికి, పడమటి కనుమలకు మధ్యనున్న ఈ తిరువనంతపుర అభ్యాసీలు, గత దశాబ్దంగా ఒక ఆశ్రమం కోసం కలలు కంటున్నారు. వారి ప్రార్థనలు ఫలించి, మాస్టరుగారు ఏప్రిల్ 15, 2006న, కేరళలోని అన్ని ప్రాంతాలనుండి మరియు తమిళనాడులోని దగ్గర కేంద్రాలనుండి వచ్చిన అభ్యాసీల సమక్షంలో ఆశ్రమానికి పునాదిరాయి వేశారు.

ఏప్రిల్ 15, 2006 తరువనంతపురం అభ్యాసీలకు చిరస్మరణీయమైన రోజు. పునాదిరాయి వేసిన తర్వాత, మాస్టరుగారు ఆ స్థలములోనే సత్సంగము నిర్వహించారు, అభ్యాసీలను ఆశీర్వదించారు.

ఆశ్రమస్థలము మూడు ఎకరాలు, దాని ప్రక్కనే రెండెకరాలు అభ్యాసీల నివాసానికి. ఈ స్థలము తిరువనంతపురం రైల్వేస్టేషను నుండి 17 కి.మీ. దూరములోను, విమానాశ్రయమునుండి 25 కి.మీ. దూరములోను ఉన్నది. పట్టణానికి మంచినీటి సరఫరా చేసే అరువిక్కరా డాముకు ఇది ప్రక్కనే ఉన్నది. డామ్‌కు నీటి సరఫరా జరిగే చోటనే ఆశ్రమస్థలమున్నది. అంతా చెట్లతో నిండి ఉంది. అన్ని వైపులనుండీ చూడచక్కని దృశ్యము, పచ్చటి మైదానముతో ఒళ్ళు పులకరిస్తుంది. ప్రియమైన గురుదేవులు దీనికి 'సేవాశ్రమ్' అని పేరు పెట్టారు. తిరువనంతపురం - వెల్లనాడ్ బస్సు మార్గానికి ఎడమవైపుగా ఈ ఆశ్రమము ఉన్నది.

ఆశ్రమస్థలములో నున్న చిన్న భవనాన్ని ధ్యానమందిరముగా మార్చి, ఆదివారము సత్సంగాలు నిర్వహిస్తున్నారు. మాస్టరుగారు ఆశ్రమ ప్లాను ఆమోదించారు. పునాది పని ఇప్పుడే ముగిసింది.

మాస్టరుగారు చెప్పినట్లుగా, ఆశ్రమాలు జ్యోతి కేంద్రాలు. అవి చీకటిని పారద్రోలి, దివ్యకాంతిని వెదజల్లును. మాస్టరుగారు ఈ జ్యోతి కేంద్రానికి ప్రారంభోత్సవం చేసే రోజు కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నాము. ఆ రోజు ఎంతో దూరములోలేదని, మేము నమ్ముతున్నాము.

## SRCM గుర్తింపుకార్డులు

మన సంస్థలో అభ్యాసీలకిచ్చే గుర్తింపు కార్డులు రెండు రకాలు.
ఈ రెండింటిలో ఏదో ఒకదానిని అభ్యాసి కలిగి ఉండాలి.

### పరిచయాత్మక కార్డు

సహజమార్గ సాధన ప్రారంభించిన అభ్యాసీకి ఈ కార్డు ఇవ్వబడుతుంది. ఇచ్చిన తేదీ నుండి ఒక సంవత్సరం వరకు దీనికి గుర్తింపు ఉంటుంద్ఇ. ఈ కార్డు పొందడానికి, అభ్యాసి, ఇంట్రడక్షన్ ఫారాన్ని పూర్తిచేసి ప్రిసెప్టరు సంతకంతో దీనినివ్వాలి.

### అభ్యాసి కార్డు

సాధన ప్రారంభించిన 6 నెలల తర్వాత అభ్యాసికి ఈ కార్డు ఇవ్వబడుతుంది. ఈ కార్డు పొందడానికి,

- అభ్యాసికి పరిచయాత్మక కార్డు ఉండాలి.
- అభ్యాసి 6 నెలల క్రమమైన సాధన చేసి ఉండాలి.
- దీనికి ప్రిసెప్టరు సిఫారసు కావాలి.
- అభ్యాసీ కార్డు పాతబడినా లేక పోయిన యెడల క్రొత్త కార్డుకొరకు అప్లై చేసుకొనవలెను.

Any other form of identity card is invalid. To apply for above cards or for related queries, an abhyasi should contact local center membership coordinator or center-in-charge. The local center coordinator works with the nodal center membership coordinator. Your zonal-in-charge has the contact details of your nodal center membership coordinator. For all other queries write an email with details to **in.idcard@srcm.org**.

**To subscribe to this Newsletter please visit http://www.srcm.org/centers/as/in/newsletter/index.jsp**
**For feedback, suggestions and news articles please send email to in.newsletter@srcm.org**

© 2008 Shri Ram Chandra Mission ("SRCM"). All rights reserved.
"Shri Ram Chandra Mission", "Sahaj Marg", "SRCM", "Constant Remembrance" and the Mission's Emblem are registered Trademarks of Shri Ram Chandra Mission.
This message may be edited for content and is intended exclusively for the members of SRCM.